క్లుప్తంగా

మంత్రి సమీక్ష సమావేశం రద్దు

అద్దంకి: అనివార్య కారణాల వల్ల నేడు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించాల్సిన విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ రివ్యూ సమావేశం వాయిదా పడినట్లు మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రోబస్ క్లబ్ అధ్యక్షుడిగా పున్నయ్య



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

వేటపాలెం: ప్రోబస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఆవుల పున్నయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రైల్వే స్టేషన్ రోడ్డులోగల రోటరీ కమ్యూనిటీ హాల్లో ప్రోబస్ క్లబ్ సమావేశంలో 2024–25 నూతన కార్యవర్గం ఎంపిక ఆదివారం నిర్వహించారు. ప్రస్తుత అధ్యక్షుడిగా ఉన్న పున్నయ్య తిరిగి కొత్త ఏడాది అధ్యక్షుడిగా ఎంపికయ్యాడు. విశ్రాంత ఆర్జేడీ స్వర్ణ ప్రయాగ రావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. వైస్ ప్రెసిడెంట్‌గా బుద్ధి సుబ్బరామయ్య, సెక్రటరీగా బీరక సుబ్రహ్మణ్యం కోశాధికారిగా బొడ్డు కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్‌గా పల్లపోలు నాగమనోహర్ లోహియా ఎంపికయ్యారు. క్లబ్ అభివృద్ధికి తమ వంతు కృషిచేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కొసనం నాగమాంబ, వలేటి సుబ్బారావు, ఎస్ఎం షరీఫ్, కర్ణ సుబ్బారావు, ఉమ్మిటి పమిడయ్య సభ్యులు పాల్గొన్నారు.

టైరు పేలి అదుపుతప్పిన కారు



దెబ్బతిన్న కారు

మార్టూరు: జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న ఓ కారు టైరు పగిలి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటన ఆదివారం మార్టూరులో జరిగింది. అందిన వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వీరేష్ యాదవ్ కారులో చెన్నై నుంచి విశాఖపట్నం వెళ్తున్నాడు. స్థానిక అంబేడ్కర్ కాలనీ ఎదురు అతని కారు ముందు టైరు ఒక్కసారిగా పగలటంతో కారు అదుపుతప్పి వేగంగా వెళ్లి రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. అదే సమయంలో కారు వెనుక వేగంగా వస్తున్న మరో వాహనం వీరేష్ యాదవ్ కారును వెనక నుంచి బలంగా ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ప్రమాదంలో కారు డ్రైవర్ వీరేష్ యాదవ్‌కు గాని అందులోని ప్రయాణికులకు గాని ఎలాంటి గాయాలు కాకపోవటంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

శింగరకొండ దర్శిని



అలంకరణలో స్వామి వారు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, జ్యేష్టమాసం, రేవతి నక్షత్రం, నవమి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ముగిసిన సమ్మర్ ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం

- రెండు నెలలపాటు శిక్షణ తీసుకున్న క్రీడాకారులు
- క్రీడా దుస్తులు పంపిణీ



క్యాంప్ ఇన్‌చార్జ్ ప్రేమయ్య చేతులు మీదుగా క్రీడా దుస్తులు అందుకున్న క్రీడాకారులు

చీరాల రూరల్: శిక్షకుల పర్యవేక్షణలో మెళుకువలు తెలుసుకుని ఆడితే ఉత్తమ క్రీడాకారులుగా ఎదుగుతారని పలువురు వక్తలు పేర్కొన్నారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్ఆర్‌పీఎం హైస్కూలు క్రీడామైదానంలో గత రెండు నెలలుగా నిర్వహిస్తున్న సమ్మర్ ఫుట్‌బాల్ శిక్షణా శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా పలువురు జాతీయ క్రీడాకారులు శిబిరాన్ని సందర్శించి శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు (గ్రాస్ రూట్స్) మంచి సలహాలను సూచనలు అందించారు. సమ్మర్ ఫుట్‌బాల్ క్యాంప్ ఇన్‌చార్జ్ బొనిగల ప్రేమయ్య ఆధ్వర్యంలో రెండునెలలుగా చిన్నారులకు ఫుట్‌బాల్ శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు చిన్నారులకు తన సొంత ఖర్చులతో పౌష్టికాహారం అందజేస్తూ వారిని మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న వైనం అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. క్రీడాకారులు చిన్నతనం నుంచి చెడు మార్గాలను విసర్జించి చదువుతో పాటు క్రీడలపై మక్కువ కలిగి ఉండాలని సూచించారు. క్రీడా పోటీలలో పాల్గొనే క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని, తోటి క్రీడాకారులను సోదర భావంతో చూడాలని సూచించారు. క్రీడాకారులు క్రీడలలను ఎలాపడితే అలా ఆడకుండా ఆటలో మెళుకువలను పాటిస్తూ ఆడాలని సూచించారు. అనంతరం క్యాంప్ ఇన్‌చార్జ్ ప్రేమయ్య తన సొంత ఖర్చులతో క్రీడాకాలందరికి నూతన క్రీడా దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్ నూతలపాటి దేవదాసు, క్యాంప్ ఇన్‌చార్జ్ బొనిగల ప్రేమయ్య, కోచ్ ప్రసన్న, నరేష్, సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ ఖోఖో దినోత్సవం



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న నాయకులు

జే.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు గ్రామంలో ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఖోఖో దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఖోఖో అకాడమీ క్రీడాకారులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీని టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈసందర్భంగా సీతారామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఖోఖో క్రీడ పట్ల పంగులూరు గ్రామానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. క్రీడాకారులకు గ్రామస్తులు ఎప్పుడు అండగా ఉంటూ వారిని ప్రోత్సహిస్తారన్నారు. గ్రామస్తులు సహకారంతో స్థానిక జూనియర్ కళాశాలలో ఎన్నో కోచింగ్ క్యాంప్‌లను నిర్వహించామన్నారు. జాతీయ జట్టుకైన, రాష్ట్ర జట్టుకైనా, జిల్లా జట్టుకైనా రాష్ట్రంలో ఎవరైనా పంగులూరులో జూనియర్ కళాశాలలో కోచ్ తీసుకోవాలనుకుంటారని చెప్పారు. అనంతరం క్రీడాకారులు గ్రామం అంతా ర్యాలీ నిర్వహించారు.

టీ-20 ప్రపంచకప్ విజేతకు అభినందనలు



క్లబ్ కార్యాలయంలో వేడుకలు నిర్వహిస్తున్న క్లబ్ సభ్యులు

అద్దంకి: టీ–20 ప్రపంచకప్ విజేత భారత జట్టుకు రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అభినందనలు తెలియజేసింది. స్థానిక కార్యాలయంలో ఆదివారం భారత జట్టుకు అభినందన కార్యక్రమం నిర్వహించింది. వెస్టిండీస్‌లోని బార్బడోస్‌లో టీ–20 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ ఇండియా, దక్షిణాఫ్రికా మధ్య జరిగింది. ఈమ్యాచ్‌లో భారత క్రికెట్ జట్టు చాంపియన్‌గా నిలవడం సాధించడం దేశానికే గర్వకారణమన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో రోహిత్‌శర్మ, విరాట్ కోహ్లీ, హార్దిక్ పాండ్య, బుమ్రా, అక్షర్‌పటేల్, సూర్యకుమార్ యాదవ్ సమష్టి కృషితో అద్భుతమైన విజయాన్ని సాధించిందని రోటరీ క్లబ్ ఆఫ్‌శింగరకొండ అధ్యక్షుడు చిన్న మురళీ కృష్ణ కొనియాడారు. ఈ కార్యక్రమంలో చప్పిడి వీరయ్య, సందిరెడ్డి శ్రీనివసరావు, షేక్ మహ్మద్ రఫీ, మలాది శ్రీనవసరావు, కొల్లా భువనేశ్వరి, బాచిన పూర్ణచంద్రరావు, అలహరి హరిప్రసాద్, చండూరి మురళీ సుధాకర్ రావు, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, చల్లా శ్రీనివాస్, పసుపులేటి ఆంజనేయులు, పువ్వాడ రామకోటేశ్వరరావు, చామర్తి సత్యనారాయణ, కొంజేటి సాయి సంకా బాబు, మన్నం త్రిమూర్తులు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించాలి



ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ పృథ్వీ, శివానీలు

స్వర్ణ (కారంచేడు): క్యాన్సర్ వ్యాధిని ప్రతి ఒక్కరూ చివరి దశ వరకు గుర్తించలేకపోతున్నారని.. ప్రారంభ దశలోనే గుర్తించగలిగితే ఎలాంటి ప్రాణ నష్టం జరగదని క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ పృథ్వి గడ్డం, డాక్టర్ శివాని చాపరాల అన్నారు. ఆదివారం మండలంలోని స్వర్ణ గ్రామంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో చీరాలకు చెందిన 'ప్రాణహిత' మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, క్యాన్సర్ సెంటర్‌కు చెందిన వైద్య నిపుణులు పాల్గొని ఉచిత వైద్య పరీక్షలు, సేవలందించారు. గ్రామంలోని సుమారు 192 మందిని ఓపీగా చూసామన్నారు. నలుగురు వ్యక్తులను చీరాల ఆసుపత్రికి రిఫర్ చేశామని తెలిపారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన ప్రజలకు వారు క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, వాటి ప్రభావం, తీవ్రతను గుర్తించుకోగలగాలన్నారు. ఎలాంటి లక్షణాలు ఉంటే క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలో వారు వివరించారు. 40 సంవత్సరాలు దాటిన ప్రజలు ఈ వ్యాధి పరీక్షలు చేయించుకోవడం ఉత్తమమన్నారు. క్యాన్సర్ పరీక్షలతో పాటు బీపీ, షుగర్, జ్వరం, థైరాయిడ్, తలనొప్పి, పక్షవాతం, కీళ్లవాతం, గ్యాస్ ట్రబుల్, ఆయాసం, ఊపిరితిత్తులకు సంబంధించిన పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

63 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయిస్తున్న ఈఈ మస్తాన్‌రావు

అద్దంకి: పట్టణంలోని ఆరో వార్డులోని రామ్‌నగర్ ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో లోపాలు లేకుండా చేసేందుకు విద్యుత్‌శాఖ నూతనంగా ఆదివారం 63 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసింది. ఇదే విధంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలోని లోపాలను సరిదిద్దేందుకు చర్యలు చేపట్టినట్లు ఈఈ మస్తాన్‌రావు ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ సత్యనారాయణ, ఏఈఈ ఆర్ శివప్రసాద్, పట్టణ ఆరో వార్డు కౌన్సిలర్ రజని, విజయ్‌కుమార్, లహరి, చిన రాముడు, పట్టణ విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ సేవాకార్యక్రమాలు భేష్

చీరాల రూరల్: వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకర్స్ సేవాకార్యక్రమాలు చేయడం మంచి పరిణామమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రోటరీ కమ్యూటీ హాలులో ఎమ్మెల్యేకు సన్మాన సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. చీరాల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని చెప్పారు. వాకర్స్ సభ్యులు ఒకవైపు తమ ఆరోగ్యాల రక్షణకు వాకింగ్ చేస్తు మరోవైపు సేవా కార్యక్రమాలు చేయడం మంచిపరిణామమని పేర్కొన్నారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ మాట్లాడుతూ హైస్కూలు క్రీడామైదానంలోని పార్కులో గ్రీనరీ ఏర్పాటు చేసి వాకింగ్ ట్రాక్, కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం వాకింగ్ సభ్యులు పచ్చిపులుసు వెంకటస్వామి, వంగర పూర్ణచంద్రరావు అనాథశ్రమాలకు నాలుగు బియ్యం బస్తాలను ఎమ్మెల్యే చేతులు మీదుగా అందించారు. కార్యక్రమంలో చారుగుళ్ల ప్రసాద్, మామిడాల శ్రీనివాసరావు, డేగల తిరుపతిరావు, అమరా వీరాంజనేయులు, నారాయణమూర్తి, వాకింగ్ సభ్యులు పాల్గొన్నారు.

జానకి రామారావు సేవలు మరువలేనివి



జానకి రామారావు దంపతులను సన్మానిస్తున్న ఆదిలక్ష్మి, తదితరులు

మార్టూరు: గ్రంథపాలకుడిగా తన 37 సంవత్సరాల సర్వీసులో ఎంతోమంది బాలబాలికలలో విజ్ఞాన, వినోద, సృజనాత్మకతలను పెంపొందించడంలో విశేష కృషిచేసిన వ్యక్తి పావులూరి జానకిరామారావు అని ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి అన్నారు. మార్టూరు లైబ్రరీలో క్రింద పాలకుడిగా పావులూరి జానకి రామారావు ఆదివారం ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉద్యోగాన్ని కేవలం తన ఉపాధి కోసమే కాకుండా సొంత లాభం కొంత మానుకొని సొంత నిధులతో గ్రంథాలయాల అభివృద్ధికి రామారావు చేసిన కృషిని ఆమె గుర్తు చేశారు. ఈ సందర్భంగా జానకి రామారావు, ఆదిలక్ష్మి దంపతులను కాసు ఆదిలక్ష్మి పరిసర ప్రాంతాల గ్రంథాల పాలకులు స్థానికులు ఘనంగా సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా గ్రంథ పాలకుల యూనియన్ నాయకులు ఏ ప్రసాద్, అద్దంకి గ్రంథపాలకుడు సుగుణ రావు, శ్యాంసన్, తెలుగు అధ్యాపకులు డీ శివరామకృష్ణ, మార్టూరు జెడ్పీహెచ్ఎస్ తెలుగు ఉపాధ్యాయులు చట్టి శ్రీనివాసరావు స్థానికులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని పూజలు



కోదండరాముడికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు

బల్లికురవ: వర్షాలు సమృద్ధిగా కురిసి సాగర్ డ్యామ్‌కు నీరు చేరి పాడి పంటలతో రైతులు సుభిక్షంగా ఉండాలని కొత్తపాలెం రామాలయం అర్చకుడు ఐనవోలు సుబ్బాచార్యులు, శివసాయి కృష్ణ, స్వామివారి వార్లకు ప్రత్యేక పూజలు చేశారు. జ్యేష్ట మాసం, నవమి సందర్భంగా ఆదివారం కొత్తపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వార్లకు వివిధ రకాల పుష్పాలు తులసీదళార్చన సంకల్పం, క్షీరాభిషేకం, తదుపరి స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. గ్రామంతోపాటు పరిసర గ్రామాల్లోని భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

జయహో భారత్ ..





చీరాల రూరల్: వెస్టిండీస్‌లో జరిగిన టీ–20 వరల్డ్ కప్ మ్యాచ్‌లో భారత్ చాంపియన్‌గా అవతరించింది. శనివారం దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్ మ్యాచ్ లో నువ్వానేనా అన్నట్లుగా పోరాడింది భారత్. చివరకు ఇండియా గెలుపొందడంతో చీరాలలో సంబరాలు అంబరాన్నంటాయి. గడియారం స్తంభం సెంటర్, కూరగాయాల మార్కెట్ సెంటర్‌లో యువకులు జాతీయ జెండా చేతబూని బాణసంచా కాల్చుతూ సంతోషాలు పంచుకున్నారు.

రోటరీ సేవాభావం అనిర్వచనీయం



విద్యార్థినులకు సైకిళ్లు అందిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల అర్బన్: రోటరీ క్లబ్ నిర్వహిస్తున్న పలు సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని, వారు అందిస్తున్న సేవా భావం అనిర్వచనీయమని చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక రోటరీ క్లబ్‌లో 38 మంది విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించారన్నారు. సేవా భావాన్ని కొనసాగిస్తూ ముందుకు సాగాలన్నారు. క్లబ్ తరుపున అందిస్తున్న సైకిళ్లను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలానే ఈపూరుపాలెం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థిని 580 మార్కులు సాధించి నూజివీడు ట్రిపుల్ ఐటిలో సీటు కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థినికి సెల్‌ఫోన్‌ను ఎమ్మెల్యే చేతుల మీదగా అందించారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు మామిడాల శ్రీనివాసరావు, చీరాల కృష్ణమూర్తి, పోలుదాసు రామకృష్ణ, బి.హేమంత్‌కుమార్. జీవై ప్రసాద్, గుర్రం రాఘవరావు, శీరం రమేష్, జాగర్లమూడి సురేష్, రామారావు, శివరంగనాయకులు, మువ్వల వెంకటరమణారావు, వీరాంజనేయులు, వెంకటేశ్వరరావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రాణాపాయ స్థితిలో ఉన్న మహిళకు సాయం



సుభానికి నగదు అందజేస్తున్న ఘంటా అనిల్‌కుమార్

చీరాల రూరల్: ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిరుపేద మహిళకు వైద్య ఖర్చుల నిమిత్తం పద్మభాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఘంటా అనిల్‌కుమార్ ఆర్థిక సాయమందించారు. ఈపురుపాలేనికి చెందిన షేక్ సుభానికి టీ స్టాల్ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. షేక్ సుభానికి ఐదుగురు సంతానం వారిలో 20 సంవత్సరాల వయస్సు కలిగిన అతని చిన్నకుమార్తె షేక్ ఫాతిమా కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఆస్పపత్రిలో చూపించగా కడుపులో రాయి ఉండడంతో నొప్పి వస్తుందని, ఆపరేషన్‌చేసి రాయి తొలగించాలని వైద్యులు సూచించి అందుకుగాను రూ. 70 వేలు ఖర్చవుతాయని చెప్పారు. అసలే నిరుపేద స్థితిలో ఉన్న ఆ కుటుంబానికి ఏమిచేయాలో పాలుపోక విషయాన్ని ఫౌండేషన్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన ఫాతిమా వైద్య ఖర్చుల నిమిత్తం ఆదివారం సాయంత్రం ఈపురుపాలెంలోని ఆమె ఇంటికి స్వయంగా వెళ్లి ఆమె తండ్రి సుభానికి రూ. 6 వేలు అందజేశారు.